# మనోరంజితం - 7

‘‘కొనకుండా ఎలా వస్తుందీ...? లోను తీసుకుంటున్నానని నీకు చెబుదామనుకుంటూనే మర్చిపోయాలే...!’’ చాలా నిదానంగా, నిర్లిప్తంగా అభిరామ్ చెప్పిన జవాబుకి మహిమకు నీరసం ముంచుకు వచ్చేసింది.

‘‘ఇపుడే ఎందుకూ... కొన్నాళ్ళు ఆగితే బావుండేదిగా...?’’ కోపం కనుపించకుండా చాలా మామూలుగా అడగటానికి ప్రయత్నించింది.

‘‘కొన్నాళ్ళు అంటే... ఎన్నేళ్ళు...? కొన్ని రోజులలో మనకేమైనా రావల్సిన ఆస్తులు వస్తాయా...? ఎప్పుడూ ఇదే పరిస్థితికదా! మా నాన్న చేసిన ఉద్యోగానికి... నాలుగు స్వంతకార్లు ఇంటిముందు ఉండాలి! ఆయన నిజాయితీ ఏం ఒరగబెట్టిందో... ఆయనకే తెలియదు...!’’ నిరసనగా అన్నాడు అభిరామ్.

‘‘ఉద్యోగధర్మాన్ని నిజాయితీగా నిర్వర్తించాననే సంతృప్తి ముందు... సంపద, సౌకర్యాలు లాంటివి చాలా చిన్నదిగా అనిపిస్తాయి... కొంతమందికి అంటే... మామయ్య గారిలాంటి వాళ్ళకి...! ఈ విషయంలో, మనం తప్పు పట్టుకోవటానికేం ఉందీ... ఎవరి జీవనశైలి వాళ్ళదీ...! మీరు మీ సంపాదననుండి ఇంటి ఖర్చులకి పైసా అయినా ఇవ్వకపోయినా... ఏమీ అనటం లేదుకదా... పైగా మీరు చేసిన పనికి ఆయన పైను కట్టినట్టుగా డబ్బుచెల్లించారు. అలాంటపుడు కొంచెమైనా మిమ్మల్ని మందలించే హక్కు లేదన్నట్లు... మీరలా మాట్లాడటం ఏమీ బాగుండలేదు...!’’

నిక్కచ్చిగా తన అభిప్రాయాన్ని చెప్పింది మహిమ.

తన సంపాదనంతా మందు అలవాటుకే ఖర్చు చేసేసుకుంటూ పైగా కారుకూడా అప్పుచేసి కొనాలని అనుకోవటం ఏమిటో...! మహిమ కోపానికి అదీ ఒక కారణమే. అందుకే ఏ మాత్రం జంకు లేకుండా సూటిగా చూస్తూ ప్రశ్నించింది.

అభిరామ్ కి ఆవేశం తారాస్థాయిలో వచ్చేసింది!

‘‘ఏమిటి నీ ఉద్దేశ్యం... నా సంపాదనంతా నేనే ఖర్చు చేసేసుకుంటున్నానని... నీ గొడవ...! అవునా... నువ్వింకా ఉద్యోగంలో చేరనే లేదు.. అభిప్రాయం వచ్చిందంతే... దానికే నన్ను అపుడే నిలదీస్తున్నావు... ఇక సంపాదన వచ్చాక ఇంకెంత రెచ్చిపోతావో...!’’

మహిమకు కోపం రాలేదు. ఈ మధ్య కాలంలో అతను ఆవేశంతో రెచ్చిపోయినట్లు కాకుండా ప్రశాంతంగా మాట్లాడితేనే ఆమెకు ఆశ్చర్యంగా ఉంటోంది!

అందుకే, నిర్లిప్తంగా నిట్టూర్చి వూరుకుంది.

* * *

ఆ మరునాడు...

మహిమ కొన్ని అప్లికేషన్సు రాస్తూ... అటుగా వచ్చిన మనోరమకు తన అభిప్రాయం చెప్పింది.

ఆవిడ ఒక క్షణం ఆశ్చర్యంగా చూసి... ''నువ్వు ఇలాంటి ఆలోచన చేస్తావని నేను అనుకుంటూనే ఉన్నాను. నేను కాదనటం లేదుగానీ... ప్రస్తుతానికి మాత్రం వద్దని నా సలహా! నిజం మహిమా... ఈ సమయంలో... నువ్వు ఉద్యోగం అంటూ హైరానా పడటం ఆరోగ్యానికీ మంచిది కాదు కూడా! రెండో కాన్పు కూడా అయ్యాక... అపుడు కొంచెం స్థిమితపడి వీలు చూసుకుని అనువుగా ఉన్నదానిలో చేరవచ్చు! ప్రస్తుతానికి మాత్రం వద్దు...!

నువ్వు అభిగురించి కూడా ఎక్కువ ఆలోచన పెట్టుకోకు. కొన్నాళ్ళు పోతే వాడే మళ్ళీ దారిలోకి వస్తాడని నాకనిపిస్తోంది...! ఒకవేళ రాకపోతే... అప్పుడు వాడి ఖర్మానికి వాడిని వదిలేయటమే మనం చేయగలిగింది! హంగు, ఆర్భాటాలు ఏవీ లేవు కాబట్టి ఇలా సాదాసీదాగా రోజులు గడిచిపోవటానికి ఇబ్బందేం లేదుగా! ఉంటే మాత్రం... ఏం సంకోచం లేకుండా... నాతో చెప్పాల్సిందే.... నన్ను మీ అమ్మలాగే అనుకుని చనువుగా ఏ మాట అయినా చెప్పాలి సుమా...!'' అంటూ ఆప్యాయంగా మహిమ భుజం చుట్టూ చేతులు వేసింది.

మహిమ కన్నీళ్ళను ఆపుకోలేక పోయింది.

మనోరమను మహిమా చేతులతో చుట్టేసింది. ''ఈ పెళ్ళితో మీతో బంధం ఏర్పడటం... నేను చేసుకున్న పుణ్యఫలం అనుకుంటానెపుడూ... నా మనసుకు ఏ చిన్న కష్టం తోచినా మీకు చెప్పుకోకుండా ఎలా ఉండగలనమ్మా..! మా అమ్మ ఈ పెళ్ళికి ఆనందంగా అంగీకరించటానికి కారణం కూడా మీలాంటి అత్తమామలు నాకు అండగా వుంటారనేకదూ...!''

కాసేపటికి ఇద్దరూ దుఃఖావేశం నుండి బయటపడి మామూలు అయ్యారు. అపుడు నిదానంగా మళ్ళీ చెప్పింది మహిమ. ''ప్రయత్నం చేయటం మొదలు పెట్టాక ఎన్నాళ్ళకి ఏ ఉద్యోగం దొరుకుతుందో... అప్పటి పరిస్థితుల్ని బట్టి... మనం నిర్ణయించుకోవచ్చు కదా...!''

అంగీకరిస్తున్నట్లుగా ''అవును... నీ మాటా నిజమే..!'' అంది మనోరమ.

ఆ తరువాత వారం రోజులకే అనుకోని సంఘటన ఒకటి జరిగిపోయింది.

ఆరోజు సెలవు కావటం వలన అభిరామ్ సాయంకాలం నుండి మొదలు పెట్టి తన మందు కార్యక్రమం కొంచెం త్వరగా ముగించి ఇంటికి చేరాడు.

వసుధ ఆడుకుంటున్నదల్లా అభిరామ్ ని చూసి లోపలకు పరుగెత్తి... ఓ మూల దాక్కుంది. అభిరామ్ కి కొంచెం కోపం వచ్చింది. రెండు మూడు సార్లు పిలిచినా రాకపోయేసరికి... అది ఇంకా పెరిగింది!

‘‘భయం దేనికమ్మా... నాన్నేగా.. ఈ రోజు నీతో ఆడుకుందామని ఇంటికి తొందరగా వస్తే... నువ్వేమిటి ఇలా చేస్తున్నావు...?’’ అంటూ వసుధని మహిమ లాలించబోతే ‘‘వద్దు... నేను నాన్న దగ్గరికి రాను... నిన్ను కొట్టినట్లే నన్ను కొడతారు..!’’ అంది బెదురుచూపులు చూస్తూ.

మహిమ ‘‘ఛ...ఛ...’’ అంటూ దగ్గరకు తీసుకుని ‘‘అలా ఎందుకు చేస్తారమ్మా...’’ అంటూ అనునయించింది.

అక్కడే వున్న మనోరమ నిర్ఘాంతపోతూ ‘‘వాడు... ఇది కూడా మొదలు పెట్టాడా...?!’’ అంది. మహిమ అదేం లేదంటూ సర్దిచెప్పబోతోంటే మనోరమ విసురుగా అంది ‘‘మహీ... నువ్వేం దాచాలని ప్రయత్నించకు.... చిన్నపిల్లకు ఏమీ తెలియదు కాబట్టి చూసింది భయంతో బయటపెట్టింది! వీడు మరీ ఇంత దిగజారతాడని కలలో కూడా అనుకోలేదు! మైకంలో కొట్టటం వరకూ వచ్చాడన్నమాట...!’’ అంది. కన్నీళ్ళను తుడుచుకుంటూ తన చీరె చెంగులో మొహం దాచుకున్న వసుధను ఆవిడ దగ్గరకు తీసుకుంది.

మహిమ వసుధకు నచ్చజెపుతూ దగ్గరకు తీసకుంటుంటే... తండ్రి దగ్గరకు తీసుకు వెడుతుందేమోననే భయంతోనే ఏమోగానీ తల్లినిచేతులతో నెట్టేసింది. ఆ వూపుకు అక్కడే వున్న కుర్చీ తగిలి మహిమ క్రిందపడి పోయింది! కడుపునొప్పితో మెలితిరిగిపోతున్న మహిమను అందరూ కలిసి హాస్పటల్ కి తీసుకెళ్ళారు. మహిమకు స్పృహ తప్పింది.

మెలకువ వచ్చాక అబార్షన్ అయిందనే విషయం తెలిసింది!

మనసులో రోదిస్తున్నా పైకి నిబ్బరం నటించింది మహిమ. తన దగ్గరే ఉన్న అభిరామ్ మనోరమలను చూస్తూ ‘‘నేను ఉద్యోగం వెంటనే చేసుకోవటానికి వీలుగా అడ్డంకిని తొలగించి... బాధ్యతల బరువు తగ్గేట్లుగా చేసింది విధి...!’’ అంది నిర్లిప్తంగా.

అభిరామ్ మహిమ వైపు నిరసనగా చూశాడు ‘‘అబ్బాయట! మన దురదృష్టం ఇలా తగలడిరది! నీకేమో అమ్మాయే కావాలని అనుకున్నావుగా, అందుకే నీ కోరిక తీర్చాలని ఆ భగవంతుడు ఇలా చేసివుంటాడు...!’’

అతని మాటల్లో ఎవరిమీదో తెలియని కసి కనిపించింది!

మహిమకు ఆశ్చర్యంగా ఉంది! ‘అబ్బాయంటే ఇష్టంలేదని తనెపుడూ చెప్పలేదే?...! ఎవరైనా ఒకటేనని కదా తను అన్నది... నిజంగా అర్థంకాకనే అభిరామ్ అలా మాట్లాడుతున్నాడా... లేక తనమీద కోపం చూపించాలని అర్థం కానట్లుగా నటిస్తూ నెపం వేయటమా...?’

ఒకసారి తిరస్కారంగా చూసి... సమాధానం చెప్పటం అనవసరమన్నట్లు తలతిప్పుకుంది మహిమ.

నిరంజన్‌తో వచ్చిన వసుధ ''అమ్మా...'' అంటూ మహిమ దగ్గరకు పరుగున వచ్చింది. ''అమ్మకి ఏమయిందీ అంటూ ఒకటే ఏడుపు... వసూని పట్టుకోవటం ఎంత కష్టమైందో...!'' అంది మనోరమ.

''నాకేం కాలేదమ్మా... బాగానే ఉన్నాను...'' అంటూ వసుధను దగ్గరకు తీసుకుంది మహిమ.

వసుధ వైపు నిరసనగా చూసి... అభిరామ్ బయటకు వెళ్ళిపోయాడు.

రెండు రోజులకి మహిమ ఇంటికి వచ్చేసింది. వారం పదిరోజులకి నీరసం అదీ తగ్గి... పూర్తి ఆరోగ్యంగా కనుపించింది.

కారు ఇంటికి వచ్చింది. అభిరామ్ చాలా హుషారుగా అందరికీ చూపించబోయాడు గానీ ఎవరూ అంత ఉత్సాహం చూపించకపోవటంతో కోపం కూడా వచ్చిందతనికి.

పైగా ఆ మరునాడే ఉద్యోగం మానేసానంటూ మహిమకు చెప్పాడు. ''తరచూ సెలవులు పెట్టేస్తున్నానంటూ మందలించబోతే, నాకు చిరాకొచ్చి రాజీనామా చేసేశాను.'' అన్నాడు ఏదో చిన్న విషయం చెప్పినట్లుగా.

కొంచెం కూడా చింత లేనట్లుగా మాట్లాడటం మహిమకు వింతగా ఉంది! ఉద్యోగం అంటూ తిరగాల్సిన అవసరం లేకుండా చక్కగా ఎపుడంటే అపుడు తాగవచ్చు కదాని ఆనందమే కాబోలు అనుకుంది.

మహిమ అనుమానాన్ని నిజమేనని రుజువు చేశాడు అభిరామ్.

మహిమ ఏవో ఉద్యోగాలకి అప్లికేషన్సు పెడుతూనే ఉంది. ఏదైనా మంచిది వస్తే అపుడు చూసుకోవచ్చులే అంటూ ముందుగా వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంది మహిమ.

తల్లి పనిచేసిన స్కూలు వాళ్ళే మహిమను అడిగారు. ఉన్నవూళ్ళోనే వచ్చిన అవకాశాన్ని కాదనుకోవటమెందుకని వెంటనే జాయినయిపోయింది మహిమ.

ఉద్యోగ బాధ్యతలతో మహిమ మనసూ కుదుటపడుతుందనే భావనతో ఎవరూ అభ్యంతరం చెప్పలేదు.

ఆరోజు... మహిమ స్కూలు నుండి ఇంటికి బయలుదేరినపుడు బస్‌స్టాప్ లో బస్‌కోసం ఎదురు చూస్తూ నిలబడిరది. అప్రయత్నంగా మహిమకు పెళ్ళికి ముందు... అభిరామ్ తో బస్‌స్టాప్‌లోనే జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది...!

ఆరోజులన్నీ ఎంత ఆనందంగా గడిచిపోయాయీ అనుకుంది. పెళ్ళితో తనకు ప్రేమమైకం దిగింది... అభిరామ్‌కి తాగుడు మైకం పట్టుకుంది... అనుకుంటూ అటు వైపుచూసిన మహిమ ఉలిక్కిపడిరది. రోడ్డుకి అటుపక్కగా ఆగివున్న కారును చూసి గుర్తుపట్టి... అభిరామ్ అక్కడ ఆపి... ఎక్కడకు వెళ్ళివుంటాడోనని ఆలోచిస్తూనే అటువైపుకి అడుగులు వేసింది.

కారులో కూర్చుని... సీసా ఎత్తి తాగుతున్న అభిరామ్ ని చూసింది.

ఆ స్థితిలో కారు డ్రైవ్ చేస్తే... ఏం జరుగుతుందోననే ఆలోచనతో ఒక క్షణం కంగారుపడి... అద్దం మీద చేతితో శబ్దం చేసింది.

డోర్ తీసి, బయటకు వచ్చిన అభిరామ్ ని చూడగానే... మహిమకు  అతనే స్థితిలో ఉన్నాడో అర్థమైపోయింది. మత్తులో సరిగా కనపడటం లేదో ఏమోగానీ మహిమను చూసి ''ఏమిటి మేడమ్... లిఫ్ట్ కావాలా...?'' అనడిగాడు.

తూలటం... ఆ మైకం చూసి ఎంతగా తాగివుంటాడోనని అంచనా వేసుకుంది మనసులోనే? అయితే తననీ గుర్తుపట్టలేనంత మత్తా...?! విచిత్రంగా తోచింది.

అప్రయత్నంగా తలవూపింది. 'ఎక్కండి'... అన్నట్లుగా చేయి చూపించాడు.

మహిమ మెల్లగా ''నాకూ డ్రైవింగ్ తెలుసు. నేనే నడుపుతాను... మీరు వెనక కూర్చోండి...'' అనగానే ''థేంక్యూ...'' అంటూ వెనక కూర్చుని బాటిల్‌ని చేతిలోకి తీసుకున్నాడు.

అభిరామ్ ప్రవర్తనకు మహిమకు నవ్వు, ఏడుపూ రెండు వచ్చాయి.

మధ్యలోనే అతను ''కారు ఆపండి... నేను ఇక్కడే దిగుతాను. ఏదైనా ఆటో పట్టుకుని వెళ్తానింటికి... మీకెందుకూ శ్రమ...'' అన్నాడు.

మహిమకు మరింత ఆశ్చర్యం కలిగింది. కారు ఆపగానే అతను దిగిపోయాడు అంటే... తనని గుర్తుపట్టక పోవటమే కాదు, కారు అతనిదేనని కూడా మరిచిపోగలిగాడా...?! మహిమకు వింతగా

ఉంది. అతను ఆటోను పిలవటం... ఎక్కటం చూసి కారును ఇంటికి పోనిచ్చింది.

ఇంటికి రాగానే.... మనోరమ ఎదురొచ్చి ''ఇదేమిటీ... కారులో అభి వెళ్ళాడు... నీకెక్కడ కలిశాడూ... వాడు నీతో రాలేదే... ఒక్కదానివీ వచ్చావేంటీ...?'' ఆదుర్దాగా ప్రశ్నలతో కంగారుపడిరది.

''ఆటోలో వస్తున్నారు...'' అంటూ మహిమ ఏడుపును బిగబట్టి తనగదిలోకి రివ్వున వెళ్ళిపోయింది.

మనోరమకు ఏం అర్థం కాలేదు. అయోమయంగా చూస్తూ నిలబడిరది. బస్సుదిగి ఆటోలో రావాల్సిన మహిమ కారులో వచ్చింది. కారులో బయటకు వెళ్ళిన అభి ఆటోలో ఎందుకు వస్తున్నాడు...? సమాధానం వివరంగా చెప్పకుండా, మహిమ ఎందుకూ దిగులుగా గదిలోకి వెళ్ళిపోయిందీ...? ఆవిడకేం అర్థం కాలేదు.

అంతలోనే అభిరామ్ ఆటో దిగాడు. ఆటో అతను జాగ్రత్తగా నడిపించుకు వచ్చాడు. జేబునుండి తీసి ఇచ్చిన అడ్రసు కాగితాన్ని చూసి ఆ ప్రకారం తీసుకువచ్చానని ఆటోడ్రైవరు చెప్పాడు. డబ్బు తీసుకుని అతను వెళ్ళిపోగానే లోపలకు వచ్చిన మనోరమ ''కారు ఏదిరా...?'' అనడిగింది.

‘‘కారు... కారు...’’ అంటూ తడబడిన అభిరామ్ ఒక క్షణం ఏదో గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తున్నట్లుగా ఆగి... ‘‘ఎవరో పట్టుకుపోయారమ్మా...’’ అంటూ మంచం మీద వాలిపోయి ‘‘రేపు... కంప్లైంట్ ఇద్దాం...’’ ముద్దముద్దగా పలుకుతూ నిద్రలోకి జారుకున్నాడు.

మనోరమకు పరిస్థితి అర్థమైంది. మహిమ వైపు దిగులుగా చూసింది.

తనని కూడా గుర్తుపట్టలేనంతగా మైకం కమ్మేసిందా అభిరామ్‌ని...! మహిమకు దిగ్భ్రాంతిగా ఉంది! తనేదో తప్పుచేసినట్లుగా మనోరమ ముందు తలవంచుకుని సిగ్గుగా తిరిగింది.

అవును... అతను మందు వ్యసనానికి మళ్ళీ లోబడే అవకాశం ఉందని, భవిష్యత్తును బలిపెట్టవద్దని మనోరమ హెచ్చరించినపుడు... తనెంత ధీమాగా, ధైర్యంగా... అలా జరగదనీ, తను జరగనీయనని ఎంత ఆత్మవిశ్వాసంతో చెప్పిందీ...! మహిమకు కన్నీళ్ళు ఉబికివచ్చాయ్...!

మనోరమతో మహిమ అవకాశం చూసుకుని మెల్లగా మనసులో మాట బయటపెట్టింది. మనోరమ నివ్వెరపాటుతో ‘‘ఏమిటీ... వేరే వెళ్తారా... మేం మీరు, వసు లేకుండా ఎలా ఉండగలం...?’’ బేలగా ప్రశ్నించిందామె.

‘‘ఆయనకూ బాధ్యత తెలిసివచ్చి... కొంచెం మార్పు వస్తుందేమోననే ఆలోచన. ఈ వూళ్ళోనే

ఉంటాంగా, ఆపైన నేను పనిచేస్తున్న స్కూలుకి కూడా దగ్గరలో ఏదైనా చిన్న పోర్షను చూసుకుందామనీ...!’’ అని నసుగుతూ బదులు చెప్పింది మహిమ.

మనోరమ ఏం ఆలోచించిందోగానీ, సరే నన్నట్లు తలవూపింది.

ఈ విషయం తెలిసి అభిరామ్ మహిమ దగ్గర గొంతు పెంచి అరిచాడు.

మహిమ మౌనం వహించింది. అద్దెకు తీసుకున్న ఇంటికి మారటం జరగిపోయింది. ‘‘నేనేదో బరువంతా నీమీదే పడేసి జల్సాగా తిరుగుతున్నానని మీ అందరి అభిప్రాయం. అందుకే వేరే ఉంటే, మన ఖర్చుల భారం ఉండదని మా నాన్నే ఈ ఏర్పాటు చేసి ఉంటాడని నా అనుమానం, నిజం చెప్పు...’’ అంటూ అభిరామ్ ఒకరోజు నిలదీసి అడిగినపుడు మహిమ సంకోచం లేకుండా జవాబు చెప్పింది.

‘‘మీ నాన్నగారి ప్రమేయం ఏమీ లేదు. నేను అత్తయ్యతో నా ఆలోచన చెప్పాను. ఆమె అంగీకరించక తప్పలేదు. ఇది మాత్రమే నిజం! ఇంకో నిజం కూడా చెబుతాను. మనం వాళ్ళకి దూరంగా ఉంటే... మిమ్మల్నీ, మితిమీరిన మీ మందు అలవాటునూ చూస్తూ నాతో పాటూ వాళ్ళూ బాధపడటం ఎందుకనిపించింది...! కన్నకూతురు భయంతో మీ దగ్గరకు రావటం లేదు, చివరకు... కట్టుకున్న భార్యను కూడా గుర్తుపట్టలేనంత దౌర్భాగ్య స్థితికి దిగజారారు...! ఇలాంటి పరిస్థితి మనకి ఎందుకు వచ్చింది... ఎవరు కారణం...?’’

ఆవేశంతో, దుఃఖంతో మహిమ గొంతూ పెరిగింది.

మళ్ళీ వెంటనే అభిరామ్ వేపు నిరసనగా చూస్తూ చెప్పింది. ''ఇక్కడకు మనం వేరే రావటం వలన... మనం ఎంత గట్టిగా అయినా అరుచుకోవచ్చు. అత్తయ్య, మామయ్య వింటారేమోననే జంకు, భయం అస్సలు ఉండదు!  మీ ఇష్టం వచ్చినపుడు ఇంటికి రావచ్చు... ఎంతయినా తాగి... ఏం వాగినా ఫరవాలేదు...! చూశారా.... మనం ఇల్లు మారటం వలన ఎన్ని సౌకర్యాలో...!''

ఆ వ్యంగ్యానికి అభిరామ్‌కి కోపం ఉవ్వెత్తున లేచింది.

''సంపాదిస్తున్నాననే గర్వంతో ఎన్ని మాటలన్నా ఫరవాలేదూ, పడివుంటానని అనుకోకు. నేనూ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాను. ఈ మాత్రం... నువ్వు చేసే గొప్ప ఉద్యోగం పాటిది సంపాదించగలనులే...!''

''దానికోసమే నేనూ ఎదురు చూస్తున్నాను...!'' తీవ్రంగానే బదులు చెప్పింది మహిమ. నిప్పులు కక్కే కళ్ళతో ఓ చూపువిసిరి... రుసరుసలాడుతూ అక్కడనుండి వెళ్ళిపోయాడు అభిరామ్.

'నిజమే... తనకూ స్వతంత్రం వచ్చింది. వసుధ స్కూలుకి వెళ్ళినా, ఇంట్లోనే ఉండే అత్తమామలు తమ గొడవ వింటారేమోననే భయం, బెదురూ లేదిప్పుడు!'' నిర్వేదంగా అనుకుంది.

* * *

నాలుగైదు నెలలు గడిచిపోయాయి. మహిమ, వసుధ ఇంట్లో ఉంటారని సెలవు రోజులలో మనోరమ వచ్చి కాసేపు ఉండి కాలక్షేపం చేస్తోంది. నిరంజన్‌రావు కూడా అపుడపుడూ వచ్చి, మనోరమ మహిమతో పాటుగా ఇంట్లో ఉంటే, వసుధను బయటకు షికారుగా తీసుకెళ్తూ, కబుర్లు చెబుతూ వసుధకు కావలసినవి కొనిపెట్టటం చేస్తున్నాడు.

ఎపుడైనా అభిరామ్ ఇంట్లో ఉంటే, తల్లితో కాసేపు ఏదైనా మాట్లాడటం జరుగుతుందిగానీ తండ్రివైపు నిర్లిప్తంగా చూసి మౌనంగా ఉండిపోవటమే అభిరామ్‌కి అలవాటు. తండ్రీకొడుకులిద్దరూ ఒకటే... మనసు విప్పి మాట్లాడుకోరు...! మనోరమ మనసులోనే చిరాకుపడుతూంటుంది. అంతకు మించి ఆమె చేయగలిగింది కూడా ఏమీ లేదు!

రోజులు గడుస్తున్నాయి అభిరామ్‌లో మాత్రం ఎదురుచూసిన మార్పు కనబడలేదు. ఉద్యోగాలూ రెండు మూడు మారాడు... దేనిలోనూ నిలకడగా ఉండలేడు. సరిగా రావటం లేదని వాళ్ళే ఉద్వాసన చెబుతున్నారో, అభిరామ్‌కే నచ్చక మానేస్తున్నాడో ఎవరికీ తెలియదు. అతను చెప్పే కారణాల పట్ల నమ్మకం కూడా తగ్గిపోయింది అందరికీ.

వేరుగా వచ్చినా వసుధ తండ్రికి చేరువ కాలేదు. తండ్రి ఉన్నపుడు వసుధ కూడా ఉండటమనేది అరుదే. అయినా అలా వుండాల్సివస్తే మాత్రం ఇంట్లో ఓ మూల నక్కి కూర్చుంటుంది. ఆ విషయం మహిమకు చాలా బాధగా అనిపిస్తుంది!

తండ్రి ఉంటే... ఆ ఇల్లు తనది కాదన్నట్లు బెరుకుగా ఉండే పరిస్థితి కూతురికి ఎందుకు వచ్చింది...? మహిమ మనసులోనే మథన పడుతూంటుంది.

ఆరోజు... మనోరమ, నిరంజన్ వచ్చినపుడు ఇంట్లో మహిమ ఒక్కతే ఉంది. మామూలుగా అభిరామ్ బయటకు వెళ్ళిపోయాడు. వసుధ స్కూలునుండి వచ్చి పొరుగున ఉండే పిల్లలతో ఆటలకు వెళ్ళింది.

ఆ సమయం చూసి... మనోరమ మహిమ దగ్గర విడాకుల ప్రస్తావన తీసుకువచ్చింది. మహిమ ఆశ్చర్యంగా చూస్తూంటే... ఆవిడ వివరణ ఇచ్చింది.

''అవును... మహిమా... బాగా ఆలోచించు. వేరుగా ఉంటే బాధ్యత తెలిసి వస్తుందనుకున్నాం. రాలేదు.  నువ్వూ దూరమైతే... అపుడు తెలిసివస్తుందేమోనని అనిపిస్తోంది! ఆఖరి అస్త్రంగా ఇదే మిగిలింది. నీ భవిష్యత్తును పాడుచేసావేమోనన్న బాధ మాకుండకూడదనుకుంటే... నువ్వూ విడాకులకి అంగీకరించు. తప్పదు. ఇలా చెప్పాల్సిరావటానికి మేం ఎంత బాధపడుతున్నామో అర్థం చేసుకో. నువ్వు సంపాదించి తెస్తుంటే... ఏదోలా జరిగిపోతోందనుకుంటూ కాలక్షేపం చేసేస్తున్నాడు. పేరుకి మాత్రమే గానీ, నీకూ, వసుధకూ అభి అండ ఏం ఉందీ...?''

మనోరమ మాటలకు మహిమ భయంగా చూసింది ఆమె వైపు ''ఒంటరిగా వదిలేస్తే... వేళకు తిండికూడా తినకుండా ఆరోగ్యం పాడు చేసుకుంటారేమోనని ఆందోళనగా ఉంది...!''

మనోరమ కళ్ళు తుడుచుకుంది. ''తప్పదు మహిమా... నిబ్బరం వహించాల్సిందే...! మీ మామయ్యా ఇదే అన్నారు...! నాకెందుకో... ఎవరూ పక్కన లేకపోతే, వాడు తప్పకుండా మారతాడనిపిస్తోంది! నువ్వూ ఆలోచించి నిర్ణయించు. ఈ విషయంలో మామయ్య ఎలాంటి సహకారం కావాలన్నా ఇస్తారు...!''

మహిమకూ కన్నీళ్ళు వచ్చాయి. ''విడిపోవటమనే ఆలోచనే భయంకరంగా అనిపిస్తోంది...!'' గద్గదికంగా అంది.

మనోరమ మహిమ చేయి పట్టుకుంది. ''ఇపుడు ఒకే ఇంట్లో ఉంటున్నారన్న మాటేగానీ, వాడి కాలక్షేపంలో మీకేం చోటు, వాటా లేవుకదా! భార్యాభర్తలుగా మీ మధ్య విడాకులనే మాటకు తావుందిగానీ... మనమధ్య మాత్రం బంధం పదిలంగా, పటిష్టంగానే ఉంటుంది. వసుధ మా మనవరాలే... నువ్వు మా కోడలివే! మీ ఇద్దరూ ఎక్కడున్నా మేం ఉన్నంత కాలం రాకపోకలు జరుగుతూనే

ఉంటాయి...!''

మనోరమ గొంతూ బొంగురుపోయింది.

ఆలోచించమని మరోసారి హెచ్చరించి వాళ్ళు వెళ్ళిపోయారు.

విడాకుల మాట వినగానే... అభిరామ్ మహిమ మీద కోపంతో కేకలు వేశాడు. తరువాత భరించలేని బాధను ఎదుర్కొంటున్నట్లు తలను రెండు చేతులతో పట్టుకుని కూలబడినట్లు కూర్చుండిపోయాడు.